# మళ్లీ చెప్పిన కథలు



రావి కొండలరావు

## కుందేలు-తాబేలు

చీమలు దూరగల చిట్టడవి. ఆ అడివిలో ఒక కుందేలూ, ఒక తాబేలూ— సముద్రమూ ఉప్పులాగా, ఎండా సూర్యుడూ లాగా, పాలూ నీళ్ళులాగా రెండూ కలిసి మెలిసి, ఎంతో స్నేహంగా వుంటున్నాయి.

తాబేలు కుందేల్ని 'దేలూ' అనీ, కుందేలు తాబేల్ని 'బేలూ' అనీ ముద్దుగా పిలుచుకుంటూ ఆడుతూ పాడుతూ తిరుగుతూ ముచ్చటగా వుంటున్నాయి. అయితే తాను ఈ కాలానికి తగ్గట్టుగా గొప్ప స్పీడు జంతువుననీ, తాబేలు వొట్టి బద్ధకిష్టి అనీ, నస అనీ, 'స్లో' అనీ కుందేలు అనుకుంటుంది. కుందేలుకి తొందరపాటు ఎక్కువ అనీ,నిదానంలేదనీ తాబేలు అనుకుంటుంది

ఓ రోజు రెండూ పాముల్లేని పుట్టని వేదిక చేసుకుని, నిదానంమీదా తొందరపాటుమీదా చర్చించుకున్నాయి. "నిదానం ప్రధానం" అని తాబేలూ"వేగమే వివేకం" అని కుందేలూ పట్టుగుద్ది వాదించుకున్నాయి. వాదనవల్ల ప్రయోజనం లేదని, పందెమే శరణ్యం అనుకున్నాయి. అడివి దాటిన తర్వాత ఒక వూరు వస్తుంది. ఆ వూరు ముందు ఏనాడూ జెండా ఎగరని పొడుగాటి స్తంభం కనిపిస్తుంది. రెండూ ఒక్కసారే బయల్దేరివెళ్ళి, ఆ స్తంభాన్ని ముట్టుకుని ఆగాలి.ఎవరు ముందువెళతారో అని పందెం!

"బేలూ! నీది నత్త నడక. నువ్వు నాతో పరుగుపందెం వెయ్యడం అనవసరం, అవివేకం" అంది కుందేలు.

"దేలూ! నువ్వు బాగా పరిగెత్తుతావు నిజమే. అంటే అంత తొందరపాటులో ఎక్కడో కాలుజారుతావు; పడతావు; నేను నిదానంగా వెళ్ళి గెలుస్తాను"అంది తాబేలు. సై అంటే సై అనుకొని, "ఒకటీ, రెండూ మూడూ" చెప్పుకొని బయలుదేరాయి. కుందేలు 'లాలాలా' అని పాడుకుంటూ, ఛెంగుఛెంగున గెంతుతూ అడవి దాటేసి, ఒక చెట్టు కనిపిస్తే, 'ఈ బేలుగాడు చేరేలోగా నేనీ నీడను విశ్రమించి నిదర పోదునుగాక!' అని హాయిగా నవ్వుకుంటూ నిద్రపోయింది. తాబేలు నిదానంగా నడుస్తూ వచ్చి చూసేసరికి, గురకతీస్తూ నిద్రలో వున్న కుందేలు కనిపించింది. 'ఆహా! చూశావా దీని గర్వం! ఎలాగైనా నేనే గెలవాలి' అనుకుంది తాబేలు. నడక కాస్త స్పీడు హెచ్చించి రోడ్డుమీది కొచ్చేసరికి, వాహనాలూ అవీ తెగ తిరుగుతూ కనిపించాయి.తాబేలుకో ఆలోచన వచ్చింది. ఈ వాహనాలు దాటుకుంటూ, తప్పించుకుంటూ తను ఎలాగూ వెళ్ళలేదు. తను పందెం గెలవాలంటే ఒకటే రోడ్డు! ఏ బండో ఎక్కి వెళ్ళిందంటే, హాయిగా స్తంభం దగ్గర దిగిపోవచ్చు. తను ఎలా వెళ్ళిందో, నిద్రలో వున్న 'దేలు వెధవ' చూశాడు గనకనా!

ఒక మనిషి సైకిల్ మీద వెళ్తూ వుంటే, తాబేలు అతడ్ని ఆపి, విషయం చెప్పింది. "ఓస్, అంతేగదా" అని, అతను తాబేల్ని



వెనకాల కారియర్ మీద కూచోబెట్టి, బయల్దేరాడు. సైకిలు చక్రాలు నాలుగు తిరుగుళ్ళు తిరిగాయో లేదో, వెనక చక్రం ఫాట్ మనడం, గాలి తుస్సుమనడం— జరిగిపోయాయి. మనిషి చిరాగ్గా చూశాడు "పొద్దున్నే గొప్ప బేరందొరికావు. నీ బరువుకి చక్రం చూడు, ఎలా పేలిందో! దిగు దిగు" అని కోప్పడి, తాబేల్ని తోసేసి, తను సైకిలు తోసుకుంటూ వెళ్ళిపోయాడు మనిషి. తాబేలు ఉస్సురోమంది తర్వాత 'బస్సురో' మంది—ఓ బస్సొచ్చి ఆగగానే, జనం కాళ్ళమధ్య పడకుండా మెల్లిగా బస్సెక్కి, ఓ సీటు కింద పీఠం వేసింది. కాని, ఏం లాభం? బస్సు బయల్దేరలేదు. ఓవర్ లోడ్ చేశారని ఒక అధికారి వచ్చి కేసు రాసి, బస్సు డ్రైవర్నీ, కండక్టర్నీ లాక్కుపోయాడు. తన ఖర్మ అనుకుంది తాబేలు. 'ఈ వాహనాన్ని నమ్ముకోకుండా నా మానాన నేను నడిచిపోయినా స్తంభం చేరేదాన్నేమో!' అనుకొని నెమ్మదిగా దిగి, నిదానంగా నడుస్తూ వుంటే తనను చూసి హారన్ కొడుతూ ఆగిపోయిన లారీ కనిపించింది. "రోడ్డుమధ్యనుంచినడుస్తావేంతాబేలూపక్కకిపో" అని డ్రైవర్ కేకలు వేశాడు. తాబేలుకి ఆశ మళ్ళీచిగిర్చింది.ఎలాగూ లారీ ఆగేవుందని విషయంచెప్పి తనకికాస్తచోటిమ్మంది. సరేనన్నాడు డ్రైవరు. కొంత దూరం వెళ్ళేసరికి రోడ్డు మీద ఏదో పెద్ద అలజడి! పోలీసులు, జనం! ఏం జరిగిందో తెలియనక్కర్లేదుగాని, జనం వాహనాల్ని ఆపేస్తున్నారు. ఆ అలజడిని అదుపులో పెట్టడానికి పోలీసులు ప్రయత్నాలు చేస్తున్నారు తాబేలు విసిగిపోయింది. ఈ ఆధునిక వాహనాల్నీ,మనుషుల్నీ నమ్ముకున్నందుకు బాధపడి లారీ దిగిపోయి, ఆ స్లోలోనే వీలైనంత స్పీడుగా నడవసాగింది.

నడిచీ నడిచీ తాబేలు స్తంభం చేరుకునేసరికి, "హాయ్" అని నిటారుగా ఎగిరి, చెవులు ఆడిస్తూ కుందేలు కనిపించింది. తాబేలు నిర్ఘాంతపోయి నిలబడిపోయింది!

"ఆహా! బేలూ! నీ వ్యవహారం అంతా నేను చూశాను. నువ్వు ఈ ఆధునిక వాహనాల్ని, జనాల్ని నమ్మి నన్ను మోసం చేదాం అనుకొన్నావు. కానీ చూశావా, నేను నా కాళ్ళని నమ్ముకొన్నాను. నా కాళ్ళమీద నేను నిలబడ్డం పరుగెత్తడమే నాకు తెలుసుగాని, నీలాగా కృత్రిమ వాతావరణాన్ని నమ్మడం నాకుతెలీదు! చూడు బేలూ ఒక నీతిచెబుతాను గ్రహించు నీ కాళ్ళమీద నువ్వు నిలబడ్డం, నడవడం నేర్చుకో. కృత్రిమ జీవితానికి అలవాటుపడితే, నీకూ మోసాలూ, అన్యాయాలూ అలవడతాయి సరే ఈ గోలంతా మనకెందుకుగాని, మన అడివికి మనం పోదాం పద" అని బేలూ, దేలూ కలిసి చెట్టాపట్టాలు వేసుకొని అడ్డదారిన చిట్టడవికి బయలుదేరాయి!